కథ

ఆ పట్నం పేరెందుకు కానీ, దానికి ఓ పాతిక మైళ్ళ దూరంలో కృష్ణానది ఒడ్డున పెట్టిన ఒక సిమెంటు ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాను. ఆ ఫ్యాక్టరీ టౌన్‌షిప్‌లో నా క్వార్టర్ పక్కనే సుబ్బారావు, సుమిత్రలు కాపురం చేస్తున్నారు. వాళ్ళ పెళ్ళి అయి ఇంకా నిండా ఏడాది కాలేదు.

# ఒక చెత్త కథ

ఎస్.కె. రమారావు



ఒకనాడు పొద్దున్నే సుబ్బారావు పరుగెట్టుకొచ్చి "కొంప మునిగింది బాబాయి" అంటూ ఆయాసం తీర్చుకునే ప్రయత్నంలో పడ్డాడు. నేను బైనాక్యులర్స్‌తో కృష్ణానదికేసి చూస్తే మామూలుగా చిక్కిపోయే కనిపించింది, మరి వీడి కొంపెట్లా మునిగిందబ్బా నా కొంపకేం కాకుండా అని ఆలోచనలో పడ్డాను.

"బాబాయి - మీ అమ్మాయి - సరేసరే - నీది మట్టిబుర్ర కదా - విడమర్చి చెబుతాను. నా భార్య సుమిత్ర ఆరోగ్యం ఏమాత్రం బాగాలేదు. ప్రొద్దుటి నుంచి పిచ్చిచూపులు - అర్ధంకాని కలవరింతలు. విషం ఏమైనా తెలిసో తెలియకో పుచ్చుకుందంటావా బాబాయి?" ఆదుర్దాగా అడిగాడు.

"మీ మామ చెంగ్రలావు నీకివ్వవలసిన కట్నం లాంఛనాలు ముట్టచెప్పాడన్నావుగా" అనుమానంగా అడిగాను.

"ఛాఛా... అలాంటిదేమీ కాదు బాబాయి. సుమిత్రను నేను ఎంత అల్లారుముద్దుగా - అనకూడదేమో ప్రేమగా చూసుకుంటానో నీకు తెలుసుగా. ఈ అడవిలో ఆవిడకు పొద్దుపోదు కాబట్టి రెండు వారపత్రికలకు చందా కట్టాను. మాంచి జపాన్ సంతతికి చెందిన టి.వి. కొనిపెట్టాను. కొత్త సినిమాల పేర్లు, హింతె నటీమణుల పేర్లు ఆవిడకు కొట్టిన పిండి అనుకో."

"ఈ హింతె నటీమణులెవర్రా?"

''అందుకే నీది మట్టిబుర్ర బాబాయి. తెలుగులో నటీమణులు లేరుగా! అంచేత హిందీ నుంచి దిగుమతయి తెలుగులో నటిస్తారన్నమాట. నటిస్తారే తప్ప మాట్లాడరు. వాళ్ళకు హింతె నటీమణులని నేను పేరుపెట్టుకొన్నాను - ముద్దుగా షార్టుగా ఉంటుందని. బాగుందా!''

''ఏడిశావు గానీ ముందు సుమిత్ర సంగతి చూడు'' అంటూ వాడి క్వార్టర్స్‌లోకి ప్రవేశించాను. సుమిత్ర కళ్ళు నిస్తేజంగా ఉన్నాయి. ఉండీ ఉండీ ఏదో గొణుగుతోంది కాని మాట స్పష్టత లేదు. పెద్దరికం ఆపాదించుకొని సుమిత్ర దగ్గరగా వెళ్ళి ''అమ్మాయ్, ఏమైందమ్మా. నేను పక్కింటి అంకుల్ గార్ని. నీ బాధ నాకు చెప్పు, చిటికెలో తీరుస్తాను''. ఎందుకు మెరిశాయో నా కళ్ళముందు దీపావళి టపాకాయల మెరుపులు మెరిశాయి. సుమిత్ర నన్ను లాగి చెంపమీద కొట్టిందన్న సంగతి పది నిముషాల తరువాత సుబ్రావ్ చెబితే తెలిసింది. నాకు కాలేజీలో ముగ్గురమ్మాయిలు వేరువేరు సంఘటనల్లో చెంపవాయించిన అనుభవం ఉంది. పెళ్ళయిన తరువాత నేను చేయని తప్పుకు చెంపదెబ్బ తిన్న మొదటి అనుభవం ఇది. పాపం సుమిత్ర కావాలని కొట్టిందా - పిచ్చిలో అలా చేసిందని సరిపెట్టుకున్నాను.

''సుబ్బుడూ - చిత్తచాంచల్యం - సరే సరే - నీకు ఈజీగా అర్థంకావడానికి చెబుతాను - మతిభ్రమణం - ఉన్మాదం - ఇలాంటి రోగాలన్నీ కలిసికట్టుగా - ఐకమత్యంగా - మీ ఆవిడ మీద ముప్పేట దాడి చేశాయి. మనం వెంటనే సుమిత్రను పట్నం తీసుకెళ్ళి డాక్టరుకు చూపించాలి. వెంటనే డా. వెంగళ్రాయుడికి ఫోన్ చేసి అంబులెన్స్ పంపించమను'' టకటక ఆజ్ఞలు జారీ చేశాను. పిచ్చికేసుల్లో ఆలస్యం చేయడానికి వీల్లేదాయిరి.

''బాబాయి అంబులెన్స్ బాగాలేదట. ముందు టైర్‌పంక్చర్ అయిందట. ఫస్టు గేరు పట్టంలేదట'' సుబ్రావు బావురుమన్నాడు.

వాడిని సముదాయించాను కానీ నాకేమీ పాలుపోవడం లేదు. మూడు రోజులుగా మా టౌన్‌షిప్‌లో కరెంటు లేదు. టీ.వీలు, ఫ్రిజ్జులు, గ్రైండర్‌లు అన్నీ విశ్రాంతి తీసుకుంటున్నాయి. భరించలేని ఉక్క. మా ఊరికి రావాల్సిన మూడవ బస్సు దానిష్టం వచ్చినప్పుడు వస్తుంది. అలా వూళ్ళోకెళ్ళి వద్దామని వెళుతుంటే గుడిదగ్గర ఒక సుమో జీపు కనిపించింది. కలా నిజమా అనుకున్నాను. ఎడారిలో ఎండమావిలా ఒక సున్నం కుప్ప నన్ను సుమోలా భ్రమింపజేసిందేమోనని దగ్గరకెళ్ళి తాకి చూశాను. నిజంగా సుమోనే. ఆ డ్రైవర్ దారితప్పి మా ఊరు వచ్చాడట. అతడిని బ్రతిమాలి సుమిత్రను, సుబ్బారావును దాంట్లోకి ఎక్కించి పట్నం చేరుకున్నాం. డాక్టర్ సుమిత్రను మాట్లాడించడానికి శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యాడు. అతడికి ఓటమి నంగీకరించడానికి అహం అడ్డం వచ్చి ఆవిడకు ప్రశ్నమీద ప్రశ్న అక్షయ తూణీరం నుంచి లాగిన బాణాల్లా వదులుతున్నాడు. సుమిత్ర పిచ్చిచూపులు మానలేదు. మనిషి చాలా డిప్రెస్‌డ్‌గా కనిపిస్తోంది. అకస్మాత్తుగా 'రెహమ్మార్-టీ-వాడా బాదా' అని పెద్దగా అరిచింది. ''ఏమిటది. దానర్థం ఏమిటని మిమ్మల్ని నిలదీస్తున్నాను'' అన్నాడు డా. రాయుడు. సుమిత్ర ఏమాత్రం చలించకుండా మళ్ళా యోగసమాధి లాంటి స్థితిలోకెళ్ళిపోయింది. రాయుడుకర్థమయింది- ఈ కేసు తను డీల్ చేయలేడు. ఎలాగోలా మా అంతట మేమే వెళ్ళిపోయేలా చేయాలి.

''ఇప్పుడు ఈవిడన్నమాటలు మీరూ విన్నారు. అవి తిరిగి అప్పచెప్పండి'' కవ్వింపుగా అడిగాడు. ''మాకు చేతకాదు - చేతైతే మీరు చెప్పండి'' ఎదురు సవాలుగా మాట్లాడాం. సెల్‌ఫోన్‌లో రికార్డర్ ఆన్‌చేసి సుమిత్రను పదేపదే విసిగించాడు. సుమిత్ర 'రెహమ్మార్ టీ వాడా బాదా' అంటూ గొణిగింది. విజయగర్వంతో అది ప్లే చేసి వినిపించి దానర్థమేమిటని మమ్మల్ని అడిగాడు. మమ్మల్ని నిలువునా కోసి ఉప్పుకారం జల్లినా దానర్థం మేం చెప్పలేమని మనవి చేశాం. డాక్టర్ రాయుడు గొంతులో కాఠిన్యం తొంగిచూసింది. ''మీ నాటకాలు నా దగ్గర కాదు. రెహమ్మార్ టీ వాడా బాదా ఒక ఉగ్రవాద సంస్థ. ఈవిడ దానికి ప్రధాన సూత్రధారి. మీరిద్దరూ సానుభూతిపరులు. ఆవిడ ఆ గొడవలోనో ఆయువు పట్టుకు దెబ్బ తగిలించుకుని మతి పోగొట్టుకుంది. మీరిద్దరూ ఆ తాటకిని నా కొంప-కం-ఆస్పత్రిలో వదిలేసి పిక్కబలం చూపుదామనుకుంటున్నారు. కానీ నాలాంటి చాకులాంటి మెదడు మీకు లేదు కదా. వెర్రికుట్టిలా నమ్మేస్తాననుకున్నారు. ఈవిడకు వైద్యమా? కల్లో మాట.''

''ఏది కల్లో మాట. మీరు వైద్యం చేయడమా? చేస్తే ఆవిడకు రోగం తగ్గడమా?'' నేనూ లడాయికి సిద్ధంగానే ఉన్నాను. బట్ట కాల్చి మీదేసినట్లు మాకు ఉగ్రవాదుల ముద్రేశాడు మరి.

''రెండూనూ. మీ జేబుల్లో పిస్తోళ్ళుంటే తీసి మర్యాదగా ఆ టీపాయ్ మీద పడేయండి. మీ స్పృహ పోగొట్టడానికి క్లోరోఫాంతో మీ వెనుక నా కాంపౌండర్-కం-అర్థాంగి రెడీగా వుంది'' వూపి చూపాడు.

''పిస్తోళ్ళా? ఇంతవరకు నిజం పిస్తోలుని ముట్టుకొని ఎరగను. ఎంత కుశాలుగున్నా మాకవి దొరికి చావడం లేదు'' నిర్భయంగా కుండబద్దలుకొట్టాను. నాకు అర్థమయింది. సుమిత్ర రోగమేమిటో వీడికర్థం కావటంలేదు. ఉగ్రవాదులు గిగ్రవాదులంటే మేం వెళ్ళిపోతామని వీడి కుతంత్రం. సరే వెడుతున్నాం డాక్టర్ అంటూ సుమిత్రను నడిపించుకుంటూ బయటికొచ్చాం. మా వీపుమీదే ధడాలున తలుపు మూసి హమ్మయ్యా వదిలాం అనుకునుంటాడు.

బయటికి వెళ్ళి ఒక కారు మాట్లాడుకొని హైదరాబాద్ బయలుదేరాం. ఊరిబయటకు రాగానే ''ఒరే సుబ్బిగా, మీ మామ మీసాల చెంగల్రావుకు ఫోన్ చేసి, సంగతంతా చెప్పి, వీలైతే మూడు బస్తాలు లేకుంటే రెండు బస్తాల కరెన్సీతో - మన్ని దిల్‌సుక్‌నగర్ దగ్గర రెడీగా ఉండి కలవమను. మనకు డాక్టర్లతోనే కాకుండా పోలీసులతో కూడా పనిబడేటట్లుంది'' అన్నాను. సుబ్బారావ్ అలాగే ఫోన్ చేశాడు.

హైద్రాబాద్ చేరాం కాని ఇలాంటి రోగాలకు ఏ స్పెషలిస్టును చూడాలో సమస్యగా మారింది. వారినీ వీరినీ వాకబుచేస్తే డా. నరాంతకరావనే నరాల నిపుణుడి దగ్గరికెళ్ళమన్నారు. అతనికి డిగ్రీలు లేకున్నా వంశపారంపర్యంగా ఈ వైద్యంలో

## దటీజ్ ఇండియా

చైనా వస్తువులు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంటే అక్కడి అమ్మాయిలు మన సంప్రదాయనృత్యాలకు పెద్ద పీట వేస్తున్నారు. జిన్ షాన్ అనే ఆవిడ బీజింగ్‌లో ఇండియన్ డ్యాన్స్ స్కూల్‌ని ఏర్పాటుచేసి అక్కడి అమ్మాయిలకు భరతనాట్యంలో శిక్షణనిస్తోంది. ఇక్కడ విశేషమేమిటంటే తన కూతురు జెస్సీకి కూడా ఆమె ఎంతో క్రమశిక్షణతో భరతనాట్యం నేర్పిస్తోంది. భారతీయత అంటే తమకెంతో గౌరవం అని అంటోందామె. మొత్తానికి మన నాట్యప్రక్రియలకు విశ్వవ్యాప్త గుర్తింపు లభిస్తోందనడానికి ఇంతకంటే గొప్ప తార్కాణం ఇంకేం కావాలి?



నైపుణ్యం వచ్చిదట. ఆసుపత్రి బాగా అధునాతనంగానే కట్టాడట. ఇంతలో చెంగల్రావు ఒక మినీ వేన్‌లో రెండు బస్తాల కరెన్సీతో వచ్చి మమ్మల్ని కలిశాడు. అందరమూ కలిసి డా. నరాంతకరావు దగ్గరికెళ్ళాం. అతను సుమిత్రను వెంటనే అడ్మిట్ చేసుకున్నాడు. ఆ తరువాత టెస్టు మీద టెస్టు శరపరంపరగా రాశాడు. దాదాపు మూడు గంటలు గడిచేసరికి అన్ని రిపోర్టులూ వచ్చేశాయి. చెంగల్రావు నన్ను చాటుగా తీసుకెళ్ళి "అబ్బాయి మొదటి బస్తా మూడొంతులు ఖాళీ అయింది" కన్నీరు కారుస్తూ దిగులుగా చెప్పాడు. "రిపోర్టులన్నీ బాగానే ఉన్నాయి. మరి సమస్య ఎలా వచ్చింది. ఆవిడ అలవాట్లు, హాబీలు – అన్నీ ఏదీ దాచకుండా పూసగుచ్చినట్లు చెప్పండి" అన్నాడు.

"డాక్టరు గారూ. ఆవిడ బొటాబొటీ మార్కులతో పదో తరగతి గట్టెక్కింది. పత్రికలు గట్రా తెగ చదువుతుంది. ఈ చెంగల్రావు గారు ఈ అమ్మాయిని మా వాడికిచ్చి పెళ్ళి చేశారు. దాదాపు అడవిలో ఉంటున్న మాకు టీ.వీ. తప్ప వేరే వినోద సాధనం లేదు."

"పొద్దున అమ్మాయి ఏదో గొణిగిందన్నారుగా! అదేమిటో చెప్పగలరా"

ఒక్కసారి నా వెన్నెముక జలదరించింది. పొద్దున డా. రాయుడు కూసిన కూతలూ, వేసిన అభాండాలూ గుర్తుకొచ్చాయి. అయినప్పటికీ "చెప్పలేము సార్. మేమే కాదు ఈ భూమ్మీద ఏకసంత, ద్విసంత, త్రిసంతాగ్రహులు కూడా చెప్పలేరు. పొద్దుటి డాక్టరుగారి సెల్‌లో ఉంది కానీ, అతను చెప్పడు. మేం అడగడానికి మా అభ్యంతరాలు, భయాలు మాకున్నాయి."

ఇంతలో అనూహ్యంగా సుమిత్ర మంచంమీద అటునుంచి ఇటు పొర్లుతూ "రెహమ్మార్ టీ వాడా బాదా" అని అర్చింది. డాక్టర్ ఎగిరి గంతేశాడు. "ఇది ఏ భాషో మీరు చెబితే రోగం నేను చిటికెలో నయం చేస్తాను". నరాంతకరావు సంతోషంగా చిటికలు వేశాడు. నేను అందరి తరఫునా చెప్పాను. మాకు తెలుగు తప్ప వేరే భాష రాదు. ఈ వాక్యం ఆ భాషలో ఉండే అవకాశం లవలేశం కూడా లేదు."

"మీ తెలుగు బాగుందే. మీరు తెలుగు కాన్వెంట్‌లో చదివారా?" అడిగాడు నరాంతకరావు. ఇలాంటి గాలిగాడితో మాట్లాడి లాభంలేదని నేను విజ్ఞతతో మౌనంగా ఉండిపోయాను. సుమిత్ర పరిస్థితిలో మార్పేమీ లేదు. అర్థంలేని కూత కూసి కళ్ళు మూసుకుని పడుకుంది. సాయంత్రం ఏడున్నరయింది. ఆస్పత్రి రిసెప్షన్ రూంలోనున్న టీ.వీ. నుంచి క్రౌంచమిథునం తెలుగు ధారావాహిక సిగ్నేచర్ ట్యూనూ, థీమ్ సాంగ్ వినిపించాయి. సుమిత్ర కళ్ళు విప్పి మంచం మీద కూర్చుంది. తర్వాత మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ నిద్రలో నడిచినట్లుగా రిసెప్షన్ రూంవేపు కదిలింది. ఆమెనేదో పిశాచం ఆవహించినట్లనిపించింది. ఆమె వెనకాలే నరాంతకరావు, అతని వెనకాల చంగల్రావు, తర్వాత సుబ్బారావు, ఆఖరున నేను లైనుగా మెల్లగా అడుగులు వేస్తున్నాం. చెంగల్రావుని ఓవర్‌టేక్ చేసి తను ముందుకెళ్ళాలని సుబ్బారావు ప్రయత్నించాడు. నేనే వాడి కాలర్ పట్టుకొని వెనక్కిలాగి, "ఫీజు ఇచ్చేవాడు. మనకు డబ్బు ఖర్చుపెట్టేవాడు ముందుండటం న్యాయం, శ్రేయస్కరం" అంటూ వాణ్ణి వెనక్కు లాగాను. సుమిత్ర ఒక కుర్చీలో కూలబడి మోరెత్తి టీవీ చూడసాగింది. క్రౌంచమిథునం ఆరోజు భాగం అయిపోయింది. సుమిత్ర ఎలా వచ్చిందో అలాగే వెళ్ళి మంచంమీద కూలబడి ముఖం చేతుల్లో దాచుకుని ఏడవసాగింది. "ఎలా వుంది మన వైద్యం? చూశారా ఎలా వెళ్ళి టీ.వీ. చూసొచ్చిందో" నరాంతకరావు గొప్పలు పోబోయాడు. "నువ్వు పరీక్షలే కదా చేయించింది. ఇంకా వైద్యం ఎక్కడ చేశావు?" చెంగల్రావు కోపంగా దబాయించాడు.

"మనం వైద్యం మొదలెట్టకముందే ఇంత ఇంప్రూవ్‌మెంటుంటే – మొదలెడితే ఏం చెప్పాలి. నా సామి చెంగా" నరాంతకరావు సంతోషం పట్టపగ్గాల్లేకుండా పోతోంది. సుమిత్ర మళ్ళీ పిచ్చిచూపులు మొదలెట్టింది. నిద్రకు ఒక ఇంజక్షన్ ఇచ్చి నరాంతకరావు ఆ రాత్రికి చేతులు దులుపుకున్నాడు.

తెల్లారి తొమ్మిది గంటలకల్లా విచిత్రంగా సుమిత్ర స్నానాదికాలు కానిచ్చి, మంచి ఇస్త్రీ చీరతో మల్లెపూవులా కనిపించింది. ఓహో పరిస్థితి చేయిజారిపోలేదు. ఈవిడకు తను స్త్రీ అని, చీరకట్టుకోవాలనే దైహిక స్పృహ ఉంది. ఈ మాటే సుబ్బుడుతో అన్నాను. వాడు ఆవిడకు సామాజిక స్పృహ కూడా వుంది అన్నాడు. నరాంతకరావు రౌండ్స్‌కొచ్చీ సుమిత్ర దగ్గరకు హుషారుగా వచ్చి "ఏం చేస్తున్నావు బేబీ" అన్నాడు. సుమిత్రకు ఇతని హుషారు ఏమాత్రం నచ్చలేదు.

"ఏం చేస్తున్నానో తరువాత చెపుతాను. ముందు రెహమాన్ని ఏం చేశావో చెప్పు" అంటూ అతడి మెడమీద చేయివేసి ముందుకు లాగడంతో తూలి బోర్లాపడబోయి నిలదొక్కుకుని, "రెహమానెవడో నాకు ఈషణ్మాత్రం తెలియదు. మా అమ్మమీదొట్టు" బితుకుబితుకుగా అన్నాడు. "నీ దొంగ ప్రమాణాలు నేన్నమ్మను. నా రెహమాన్ కేమయిందో చెప్పు. చెప్పకపోతే నీ పేగుల్ని పీకి ఆ కనిపిస్తున్న కిటికీకి వేలాడేస్తా" హుంకరించింది.


"వాడెవడో ఎలాటి జులాయి వెధవో నాకు తెలీదన్నానా. నా పేగుల జోలికి రాకు తల్లీ" అన్నాడు. పెద్ద జోకేసినట్లు మావైపు చూశాడు. "నా రెహమాన్ని జులాయి వెధవంటావురా. ఎన్ని గుండెలు" అంటూ నరాంతకరావు పొట్టలో తన మోకాలు మడిచి పొడిచింది. అతని కళ్ళముందు ఎన్ని చుక్కలు మెరిశాయో, వాడి పూర్వీకులు ఎంత మంది గుర్తుకొచ్చారో ఏమో! నరాంతకరావు బాధతో లుంగలు చుట్టుకుపోతూ "సుబ్బా – చెంగా – లేక చెంగ సుబ్బులు ఆ మూడోవాడెవడ్రా వాడూ – బాబాయిగాడూ – మీ పుణ్యం ఉంటుంది, ఆ రెహమాన్ ఎవడో మీరన్నా చెప్పండ్రా" దీనంగా ప్రాధేయపడ్డాడు. మేం కోరస్‌గా మాకు తెలీదన్నాం.

"మీకు తెలియకుండా ఉండదు. మీ బంధువర్గంలో ఆ రెహ్మాన్‌గాడెవడో – వాడిని పిలిపియ్యండి. అంతా సర్దుకుంటుంది."

"ఏంటి సర్దుకునేది నీ బొంద. మేం హిందువులం. మా బంధువర్గంలో రెహమాన్ ఎలా ఉంటాడయ్యా! మరీ ఎంత ప్రాణభయం వున్నా ఇంత బుద్ధితక్కువ కూతలా?" చెంగల్రావు నిప్పులు చెరిగాడు.

"మీ వాళ్ళలో ఎవరికన్నా అలాటి ముద్దుపేరుందేమో. బాబ్బాబు వేగిరం జ్ఞాపకం చేసుకొని పిలిపియ్యండేం" నరాంతకరావు ఈసారి బుజ్జగింపుగా అన్నాడు.

"మా బంధువుల్లోగానీ, వాళ్ళ బంధువుల్లో కానీ అలాటి ముద్దు పేరెవరికీ లేదు" సుబ్బారావు కలుగజేసుకున్నాడు. నరాంతకరావుకు ప్రాణభయం మొదలైంది. 'ఎరక్కపోయి ఈ కేసు ఒప్పుకున్నానురా దేవుడా. ఈసారికి గట్టెక్కించు భద్రకాళీ. రాబోయే రెండు కేసుల్లో నీకు నరబలి ఇచ్చుకుంటా' అని మనసులో చెంపలు వేసుకున్నాడు.



జ్ఞానజ్యోతి అకస్మాత్తుగా వెలిగినట్లు నరాంతకరావు మనసుకు ఒక దివ్యమైన ఆలోచనొచ్చింది. ''ఈవిడ పెళ్ళి కాకముందు కానీ తరువాత కానీ రెహమాన్ అనే వాడిని ప్రేమించిందేమో. మీరు ఆ దిశగా ఆలోచించినట్లు లేరు'' అన్నాడు. అంతే చెంగల్రావూ – సుబ్బారావు నరాంతకరావును వంతులవారీగా తన్నారు. నేను కేవలం కుస్తీ పోటీలో రెఫరీ పాత్ర పోషించాను. ఆఖరుకు నరాంతకరావు సుమిత్రకు నమస్కరిస్తూ – ''అమ్మా వాడెవడో మీరే చెప్పి నాకు ప్రాణభీతి తగ్గించరాదా'' దీనంగా అన్నాడు.

సుమిత్ర తేరుకొని ''అందుకని కొట్టుకుంటున్నారా? రెహమాన్ క్రౌంచమిథునం సీరియల్‌లో హీరో. నేను ఆఖరిసారి టీ.వీ. చూసినప్పుడు విలన్ అతన్ని తుపాకీతో కాలిస్తే నదిలో పడ్డాడు. ఆరోజు అంతవరకే వచ్చింది. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. రెహమాన్ బతికే ఉన్నాడో, లేక జరగకూడనిది ఏదైనా జరిగిపోయిందో'' ముక్కులు ఎగబీల్చడం మొదలెట్టింది.

''ఆ తరువాత నేను చెబుతాను. మర్నాటినుంచి మనూళ్ళో మూడ్రోజులు కరెంటు లేదు. మూడోరోజునుకుంటా – నువ్వు కాస్త పిచ్చి చేష్టలు ప్రదర్శిస్తే ఇలా ఇక్కడకు తెచ్చానన్నమాట'' అన్నాను. నరాంతకరావుకు ప్రాణం లేచొచ్చింది. సుబ్బారావు సంతోషానికవధుల్లేవు. ఈ రెహమానెవరో తెలియబట్టి సరిపోయింది. లేకపోతే నరాంతకరావు ఇందాకటి మాటల్ని బట్టి జీవితాంతం ఒక అనుమానం, ఒక మానసిక క్షోభ ఇంకా నామర్దాతో బదకాల్సి వచ్చేది. తనను జీవచ్ఛవం కాకుండా కాపాడిన టి.వి. సీరియల్‌కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

నరాంతకరావు మటుకు అత్యంత గౌరవంతో ''అమ్మా నాకు టీ.వీ. సీరియల్స్ చూసే అలవాటు లేక మీ రోగ నిర్ధారణలో కొంత జాప్యం చేసిన మాట నిజమే. నిజానికి రెహమాన్ గారు సజీవులో లేక నదిలో తమ అంతిమశ్వాస వదిలారో నాకు తెలియదు'' చేతులు జోడించాడు. నేనూ సుబ్రావూ కూడా మాకు టీవీ సీరియల్స్ చూసే అలవాటు లేదని, కరెంటు లేని ఆ మూడ్రోజులూ మా ధ్యాసను కేవలం చల్లటి మంచినీళ్ళు సంపాయించటమెలా – వేడెక్కిన వాతావరణంలో శరీరాలను సేదతీర్చటమెలా లాంటి ప్రాపంచిక సుఖాలచుట్టే తిప్పామని, కళా సాహిత్య రంగాల పట్లా, టీవీ నాటక రంగాల చుట్టూ తిప్పలేకపోయామని వప్పేసుకున్నాం.

''మరి, ఇప్పుడెలా? రెహమాన్ ఏమయ్యాడో నాకెలా తెలియాలి'' సుమిత్ర పొలికేక పెట్టింది. ఇది విన్న స్టాఫంతా పరుగెత్తుకొచ్చారు. ముందు సుమిత్రను అభినందించి, రెహమాన్‌కేమీ కాలేదని, మర్నాటి ఎపిసోడ్‌లో రెహమాన్ నదిలో వీరోచితంగా ఈత కొడుతూ విజయవంతంగా వడ్డు చేరుకున్నాడనీ, అసలు తుపాకీ గుండు అతనికి తగల్లేదని, పక్కనుంచి రాసుకుపోయిందని, తమతమ ఇష్టదైవాల మీద ప్రమాణం చేసి, ఒకరి తరువాత ఒకరుగా చెప్పుకుపోయారు. సుమిత్ర ససేమిరా నమ్మనంటూ మళ్ళీ ఒక పొలికేక పెట్టి మంచం మీద విరుచుకుపడిపోయింది.

డా. నరాంతకరావు గదిలో అంతా చేరాం. కేసు పూర్తిగా నయమయినట్లే. కాకపోతే రెహమాన్ బతికున్నట్లు నమ్మకంగా తెలియజేసేవాడు కావాలి. చెంగల్రావు చెంగున లేచాడు. ''ఇంతకీ ఈ క్రౌంచ మిథునం డైరెక్టరూ రచయిత లెక్కడుంటారు?''

''టైటిల్స్ ప్రకారం అయితే ఇద్దరూ ఒక్కటే – లేక ఒక్కడే – ఈ హైద్రాబాద్‌లోనే ఉంటారు'' ఒక డెబ్బై ఏళ్ళ ఆడ పేషంటు ఓపిగ్గా చెప్పి వివరాలిచ్చింది.

ఒక అంబులెన్స్‌లో అందరం సర్దుకున్నాం. మా వెనుక డబ్బు బస్తాలు మోస్తున్న మినీ వాహనం వస్తుండగా అందరం డైరెక్టరు గారిల్లు చేరుకున్నాం. అతను ఇంట్లోనే ఏదో తమిళ సినిమా డి.వి.డి. చూస్తూ కనిపించాడు. మమ్మల్ని చూస్తూనే ''వందిట్టియ్యా ఎన్న ఆలీసెం'' అన్నాడు. వీడు మనల్నెవరో నిర్మాతలనుకుంటున్నాడు కాబోలని సరిపెట్టుకున్నాం. చెంగల్రావు అమాంతం డైరెక్టరు కాళ్ళమీద పడి జరిగిన తంతంతా చెప్పుకొచ్చాడు. అంతా విని ఆ డైరెక్టరు తాను పిచ్చివాళ్ళ దగ్గరకు రానన్నాడు. చెంగల్రావు వాడిని తంతానని నేనెంతో ఆశ పెట్టుకున్నాను. దానికి బదులుగా చెంగల్రావు వాడి మొహాన పావుబస్తా నోట్లు కొట్టి వాడిని ఆసుపత్రికి బయలుదేరదీశాడు. బండిలో చెంగల్రావు చెప్పాడు. ''పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు మనం మన పద్ధతుల్లో మార్పు తెచ్చుకోవాలి. డాక్టరును కొట్టామనుకో. అతను మన్ని తన్ని తరిమేసినా వేరే డాక్టరు దగ్గరకెళ్ళొచ్చు. ఎకరం భూమమ్మిన డబ్బు మన దగ్గర కనీసం వంద బస్తాలుందిగా. కానీ వీడిని కొట్టామనుకో క్రౌంచమిథునానికి వీడొక్కడే డైరెక్టరు. పది బస్తాలిచ్చినా రానని నీలుక్కూచుంటే మనం ఛస్తాం'' చెంగల్రావ్ ముందుచూపునకూ, దూరదృష్టికి అతన్ని మనసులోనే అభినందించాను.

క్రౌంచమిథునం దర్శకుడు స్వయంగా సుమిత్రకు చెప్పాడు – ''రెహమాన్ చావలేదు. వాడిప్పుడప్పుడే చావడు. ఇంకో మూడేళ్ళపాటు వాడి వయసులో తేడా కూడా ఏమీ రానివ్వను. ఈ సీరియల్ గోదావరి పుష్కరాలకు మొదలయ్యింది. మళ్ళీ గోదావరి పుష్కరాలు వచ్చేవరకు లాగే పూచీ నాది. ఆపైన అంటారా! మీ ప్రేక్షకాభిమానం ఇలాగే ఉండి, నా ఆరోగ్యం బాగుంటే ఇంకో మూడు సంవత్సరాలు లాగిస్తా.''

సుమిత్ర ఉత్సుకత పట్టలేకపోయింది. ''మరి అంకుల్ మాకు రెండిళ్ళవతల ఒకళ్ళు కాపురముంటున్నారంకుల్. వాళ్ళు నాతో రేపు క్రౌంచమిథునంలో ఫలానా వాడి పెళ్ళి సీనుంటుంది. ఫలానా వాడి దహనపు సీను ఉంటుందని చెబుతారంకుల్. అది ఎలా సాధ్యం?''

డైరెక్టరు మాట్లాడకుండా చెంగల్రావుకేసి అర్థవంతంగా చూశాడు. చెంగల్రావు బయటకెళ్ళి ఒక చేటతో చేటెడు నోట్లు తెచ్చి డైరెక్టరు వళ్ళో పోశాడు. డైరెక్టరు మొహం విచ్చుకుంది.

''ఏమీ లేదమ్మా. రేపు తెలుగులో రాబోయే భాగం ఇవాళ తమిళంలో, నిన్న మళయాళంలో, మొన్న కన్నడంలో వస్తుంది. అది చూస్తే నువ్వూ చెప్పేయొచ్చు అమ్మణ్ణీ. భాష రాకున్నా – కళ్యాణం కళ్యాణమనీ, కడైసి యాత్ర కడైసి యాత్రనీ తెలుసుకోవచ్చుగా'' అన్నాడు.

''అయితే క్రౌంచమిథునం డబ్బింగా అంకుల్.''

''నూటికి నూరు పైసలు. అన్ని భాషలకూ డైరెక్టర్ని నేనే. రచయితలే వేరు వేరు. అంతా నా పేరు బలం మీద సాగిపోతుందనుకో. వెళ్ళొస్తా'' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత అంతా మావూరు వచ్చేశాం. మా బజారులో ఎవరింట్లోనూ టీవీ లేదు. చెంగల్రావు బస్తాలో మిగిలిన కాస్త డబ్బు ఒక వృత్తి దొంగ చేతికిచ్చి సుబ్బారావింట్లో టి.వి. దొంగిలించమన్నాడు. సంజీవి మొక్కను గుర్తుపట్టక మొత్తం పర్వతాన్నే పెకలించి తీసుకుపోయిన ఆంజనేయస్వామిలా ఆ దొంగోడు సుబ్బారావు ఇల్లు గుర్తుపట్టలేక అందరిళ్ళలో టీవీలూ పట్టుకెళ్ళిపోయాడు. ★

